ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
21-09-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 20 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారు. గతేడాది సింగరేణి సంస్థ ఉత్పత్తి, గడించిన లాభాల ఆధారంగా బోనస్‌ను ప్రకటించారు. ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ చెల్లించాలని నిర్ణయించారు.

# సింగరేణి కార్మికులకు తీపి కబురు

## లాభాల ఆధారంగా రూ. 796 కోట్లను కార్మికులకు బోనస్

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికులు అగ్రభాగాన నిలిచారని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంతో గని కార్మికుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సింగరేణి లాభాలు, విస్తరణ.. బోనస్‌కు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వివరించారు. సింగరేణి కార్మికుల శ్రమతో 2023, 24 సంవత్సరంలో సంస్థకు మొత్తంగా రూ.4,701 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించగా మిగిలినవి రూ.2,412 కోట్లు. ఇందులో మూడో వంతు రూ. 796 కోట్లను కార్మికులకు బోనస్‌గా ప్రకటించారు. సింగరేణిలో మొత్తం 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు. ఒకొక్కరికి బోనస్ కింద రూ.1.90 లక్షలు. గతేడాది సింగరేణి కార్మికులకు అందిన బోనస్ రూ.1.70 లక్షలు మాత్రమే. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా ఒకొక్కరికి రూ.20 వేలు. సింగరేణి సంస్థ చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బోనస్ చెల్లింపు. సంస్థలోని 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు తొలిసారి రూ.5 వేల చొప్పున బోనస్. సింగరేణి సంస్థ భవిష్యత్ అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయం. సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని 1000 మెగావాట్లకు విస్తరించడం, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, జైపూర్‌లోని ప్రస్తుత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 1X800 మెగావాట్ల సామర్థ్యం కల మరో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, రామగుండంలో టీఎస్ జెన్ కో ఆధ్వర్యంలో మరో 1X800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పైన (పిట్ హెడ్) 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం. వీటితో పాటు సింగరేణి కుటుంబాల సంక్షేమానికి పాఠశాలలు, హైదరాబాద్ లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం.

# హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలివే...



2 లో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు సడలించాం. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యూటేషన్ పై రప్పిస్తున్నాం.

# రుణ మాఫీపై ప్రధాని మోడీ సంచలన వ్యాఖ్యలు..!

**జయభేరి, హైదరాబాద్ :**

కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసపూరిత హామీలు అసత్యాలేనని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తెలంగాణలో రైతు రుణాలను మాఫీ చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులను మోసం చేసిందని చెప్పారు. దిక్కుతోచని స్థితిలో తెలంగాణ రైతాంగం రుణ మాఫీ కోసం తిరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో రైతులను నిండా ముంచిందని దుయ్యబట్టారు. మహారాష్ట్రలోని వార్ధాలో శుక్రవారం ఓ కార్యక్రమంలో ప్రధాని కాంగ్రెస్ పార్టీ ఇవాళ గతంలోలా లేదని అన్నారు. ఇవాళ కాంగ్రెస్ లో దేశభక్తి స్ఫూర్తి లోపించిందని అన్నారు. విదేశీ గడ్డపై కాంగ్రెస్ నేతలు వాడుతున్న భాషను చూస్తే బాధేస్తోందని చెప్పారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడం, దేశ సంస్కృతిని అవమానపరచడం వంటి దేశ వ్యతిరేక అజెండాతో ముందుకెళుతున్నారని ఆరోపించారు. తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సల్స్ వంటి వారితో ఇవాళ కాంగ్రెస్ పార్టీ నడుస్తున్నదని అన్నారు. ఇవాళ దేశంలో అత్యంత అవినీతి, నిజాయితీ



లేని పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని మండిపడ్డారు. దేశంలో అత్యంత అవినీతి కుటుంబం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ రాజ కుటుంబమేనని ప్రధాని మోడీ ఆరోపించారు.

# తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ..

## తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం

- ఈ మొత్తం వ్యవహారం పై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరిన కేంద్రం

**జయభేరి, న్యూ ఢిల్లీ /అమరావతి :**

వైసీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న వార్తలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో లడ్డూ కల్తీ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న వార్తలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లడ్డూ ...మిగతాది 2 లో





## లడ్డూ తయారీలో కల్తీ జరిగిన మాట వాస్తవమే

- టీటీడీ ఈవో శ్యామలారావు

**జయభేరి, అమరావతి, సెప్టెంబర్ 20:**

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిన మాట వాస్తవమేనని టీటీడీ ఈవో శ్యామలారావు స్పష్టం చేశారు. ల్యాబ్ నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా కల్తీ జరిగినట్టు గుర్తించి సరఫరాదారు ...మిగతాది 2 లో

## పుణ్యక్షేత్రాల పవిత్రతను

# మనం కాపాడుకోవాలి

**జయభేరి, న్యూఢిల్లీ:**

తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. శ్రీ వేంకటేశ్వరుడు మన దేశ వ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది పూజించే దైవమని అన్నారు. లడ్డూ కల్తీ వ్యవహారం ప్రతి భక్తుడిని బాధపెడుతుంది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. దేశంలోని పుణ్యక్షేత్రాల పవిత్రతను మనం కాపాడుకోవాలి అని రాహుల్ గాంధీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా వేదికగా పేర్కొన్నారు. తిరుమలతో పెట్టుకుంటే ఏమైనారో చరిత్ర చెబుతోంది, దొంగల బ్యాచ్, రఘురామ కృష్ణరాజు కాగా, తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూ అంటే కోట్లాది మంది భక్తులకు ఎంతో పరమ పవిత్రమైనది. అలాంటి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, ఫిష్ ఆయిల్ కలపడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక, తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల



కొవ్వు, ఫిష్ ఆయిల్ వినియోగిస్తున్నట్లుగా ఎన్డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు NDDB) నివేదిక తేల్చడం గమనార్హం. దీంతో గత వైసీపీ పాలకులపై విమర్శలు వస్తున్నాయి.



# అక్టోబరు 2 నుంచి రేషన్ కార్డుల దరఖాస్తులు

**జయభేరి, నల్గొండ, సెప్టెంబర్ 20:**

రేషన్ కార్డులు జారీకి పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నూతన రేషన్ కార్డుల కోసం అక్టోబరు రెండో తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ...మిగతాది 2 లో

# మహిళలు సమాజ సృష్టికర్తలు

- మంత్రి సీతక్క



**జయభేరి, హైదరాబాద్:**

మాదాపూర్ లోని టెక్ మహీంద్రా క్యాంపస్ లో సిఐఐ ఇండియన్ వుమెన్ నెట్వర్క్ తెలంగాణ 10వ వార్షిక లీడర్షిప్ సదస్సును సీతక్క ప్రారంభించారు. సీతక్క మాట్లాడుతూ మహిళలు సమాజ సృష్టికర్తలు. కానీ మహిళలను చిన్న చూపు ...మిగతాది 2 లో



# జమిలీ ఎన్నికలు జరిగితే..

- రేవంత్ కు ఆరేళ్ల పాలన

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

జమిలి ఎన్నికలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కలిసి వచ్చేలా కనిపిస్తున్నాయి. ఆయన అధినాయకత్వం సహకరిస్తే ఆరేళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగేలా అవకాశాలున్నాయి. అయితే జమిలి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్నది మాత్రం ఇంకా తేలకపోయినా.. ఇప్పుడిప్పుడే జరిగే అవకాశం లేదన్నది న్యాయనిపుణుల అంచనా. జమిలి ఎన్నికలు జరపాలంటే అనేక ప్రక్రియలను జరపాల్సి ఉంటుంది. జనగణన దేశ వ్యాప్తంగా పూర్తి చేయాల్సి ...మిగతాది 2 లో

2 లో

# తిరుపతి లడ్డూ ప్రసాదంలో అపచారం అక్కడే జరిగిందా..?

▶▶ మొదటిపేజీ తరువాయి

## హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు సడలించాం. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యూటేషన్ పై రప్పిస్తున్నాం. 169 మంది అధికారులు, 964 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది కేటాయింపు చేసినట్లు మంత్రులు తెలిపారు. ఓఆర్ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి. 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో విలీనం చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్మెంట్ ఖరారుకు కమిటీ ఏర్పాటు. ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 12 మందితో కమిటీ. కమిటీ కన్వీనర్‌గా ఆర్అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ వ్యవహరించనున్నారు. మనోహరాబాద్ లో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. 3 వేలకుపైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ 8 మెడికల్ కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం, 3 వేలకుపైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో 58 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఏటూరు నాగారం ఫైర్ స్టేషన్‌కు 34మంది సిబ్బంది మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కోస్గి ఇంజినీరింగ్ కాలేజీ, హకీంపేటలో జూనియర్ కాలేజీలు మంజూరుకు రాష్ట్రమంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు మంత్రులు వెల్లడించారు. రాష్ట్రంలోని మూడు యూనివర్సిటీల పేర్ల మార్పునకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కోఠి మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు, తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు, టెక్స్ టైల్ అండ్ హ్యాండ్లూమ్ వర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టేందుకు రేవంత్ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులకు రూ. 4637 కోట్లు మంజూరు చేయడంతోపాటు రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మరోవైపు, ఈ ఖరీఫ్ నుంచి ఎంఎస్పీకి అదనంగా రూ. 500 చెల్లించి సన్నాలు కొనుగోలు చేయాలని నిర్ణయం. ఈ ఖరీఫ్‌లో 1.43 లక్షల టన్నుల పంట వస్తుందని అంచనా వేశారు. ఇక, అక్టోబర్ నుంచి కొత్తగా తెల్ల రేషన్ కార్డుల జారీ చేయడంతోపాటు జనవరి నుంచి అన్ని రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తామని మంత్రులు వెల్లడించారు.

## జమిలీ ఎన్నికలు జరిగితే..

ఉంటుంది. అసెంబ్లీతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా పార్లమెంటు నియోజకవర్గాల సంఖ్య కూడా పెరగనుంది.. దీంతో పాటు పార్లమెంటు ఉభయ సభల్లో జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లులను ఆమోదించాల్సి ఉంటుంది. ఇది కొంత కష్టంతో కూడుకున్న పనే. ఎందుకంటే ఇండియా కూటమి ఇప్పుడు బలంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలను పదిహేను పార్టీలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో అనేక బ్రేకులు జమిలి ఎన్నికలకు అడ్డం కానున్నాయి. అధికారానికి కాల పరిమితి ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తూ ఊరుకోవు. అవి న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాలున్నాయి. అనేక రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పూర్తి చేయాలంటే ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు 2029 నాటికి అన్ని సానుకూలిస్తే తప్ప జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు. 1951 నుంచి 1967 వరకూ దేశమంతా ఒకే సారి ఎన్నికలు జరిగేవి. తర్వాత ప్రభుత్వాలు కూలిపోవడంతో పాటు రాజీనామాలను చేయడం వంటి కారణాలు కూడా వేర్వేరు సమయాల్లో రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూ వస్తున్నాయి. మధ్యంతర ఎన్నికలు భవిష్యత్ లో రావన్న గ్యారంటీ లేదు. మనది ప్రజాస్వామ్య దేశం. కేజ్రీవాల్ ఇప్పటికే ముందస్తు ఎన్నికలకు సిద్ధమయ్యారు. భవిష్యత్ లో ఇలాంటివి జరగవన్న గ్యారంటీ లేదు. దేశంలో సగం రాష్ట్రాలు జమిలి ఎన్నికల ప్రతిపాదనలను ఆమోదించాల్సి ఉంటుంది. ఇవన్నీ జరగాలంటే సమయం చాలా పట్టే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. 2029 ఎన్నికలకు జమిలి ఎన్నికలు జరిగే అవకాశముంది. 2029 ఎన్నికలు జరిగితే మాత్రం తెలంగాణలో రేవంత్ రెడ్డి రొట్టె విరిగి నేతిలో పడినట్లే. మరో ఏడాది పదవీ కాలం కలసి వస్తుంది. జమిలి ఎన్నికలు జరపాలంటే మరో ఏడాది పాటు ప్రభుత్వ పాలనను పొడిగించాల్సి ఉంటుంది. అదే జరిగితే రేవంత్ రెడ్డి మరో ఏడాది పాటు అదనంగా ముఖ్యమంత్రిగా వ్యవహరించనున్నారు. నిజానికి తెలంగాణలో 2028లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే జమిలి ఎన్నికలను 2029 లో జరపాలని నిర్ణయిస్తే మాత్రం తెలంగాణకు కూడా మరో ఏడాది పాటు పాలన గడువును పెంపొందించాల్సి ఉంటుంది. మొత్తం మీద జమిలి ఎన్నికలు జరిగితే ఎవరి మాట ఎలా ఉన్నా, ఎవరి అభిప్రాయాలు ఎలా ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి అదనంగా మరో ఏడాది ముఖ్యమంత్రిగా కొనసాగే వీలుందంటూ సోషల్ మీడియాలో పోస్టులు దర్శనమిస్తున్నాయి.

## అక్టోబరు రేషన్ కార్డుల దరఖాస్తులు

ఈ సందర్భంగా రేషన్ కార్డుల జారీకి సంబంధించి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇచ్చేదానిపై కసరత్తు చర్చించారు. ఈ అంశంపై త్వరలోనే మరోసారి సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చాలా రోజులుగా కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే కొత్త కార్డుల జారీ కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కొద్దిరోజులుగా రేషన్ కార్డుల జారీకి సంబంధించి అధ్యయనం చేస్తోంది. ఇటీవలనే సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన నిబంధనలు, విధి విధానాలపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటించింది. కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు జారీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కొత్తరేషన్‌కార్డులు, హెల్త్ కార్డులు విడివిడిగా అందిస్తామని వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డుల జారీపై తుది ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు అందిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, హెల్త్ కార్డులు జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్తరేషన్ కార్డు విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారు. వైట్ రేషన్ కార్డులకు ఎవరు అర్హులనేదానిపై వచ్చే భేటీలో నిర్ణయిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో రేషన్ కార్డులు ఎలా ఇస్తున్నారనేదానిపై అధ్యయనం చేస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి నిబంధనలు ఎలా ఉండాలని రాజకీయ పార్టీలకు లేఖ రాశామన్నారు. కొన్ని పార్టీలు సూచనలు చేశాయన్నారు. ఇలా వచ్చిన సూచనలపై సమావేశంలో చర్చించామన్నారు. తెలంగాణలో దాదాపు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రేషన్ కార్డులపై ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో కేవలం 49 వేల రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చిందన్నారు. అవి కూడా ఉప ఎన్నికలు వచ్చిన నియోజకవర్గాల్లో ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. సెప్టెంబర్ 21వ తేదీన మరోసారి కేబినెట్ సబ్ కమిటీ సమావేశం ఉంటుందన్నారు. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

## మహిళలు సమాజ సృష్టికర్తలు

చూసే మెంటాలిటీ ఉంది. అందుకే మహిళలు ఇంకా వెనకబడే ఉన్నారు. ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్న ..పురుషులే గొప్ప అనే భావన ఉంది. తక్కువ అనే ఆలోచన నుండి మహిళలు బయటపడాలి. మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యి మంత్రిగా సేవలందిస్తున్న. ఆదివాసి మహిళకు పంచాయతీరాజ్ వంటి వంటి పెద్ద శాఖను నాకు ఇచ్చారు. 13 వేల గ్రామపంచాయతీలు, రెండు కోట్ల మంది ప్రజలకు సేవ చేసే బాధ్యతను నాకు అప్పచెప్పారు. బాధ్యతలు స్వీకరించి పట్టుదలతో పనిచేస్తున్న. పని ప్రాంతాల్లో మహిళలకు భద్రత కల్పించాలి. వర్క్ ప్లేస్ లో మహిళలకు భద్రత లేకపోతే ఇంకెక్కడ భద్రత ఉంటుంది. ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే ప్రశ్నించడం నేర్చుకోవాలి. మీకు ఎదురవుతున్న సవాళ్లను మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారం కోసం చట్టాలు చేస్తాం. పని ప్రాంతాల్లో మహిళల మీద వేధింపులను సహించేది లేదని అన్నారు. వ్యాపారాలు, వ్యాపారవేత్తలు పట్టణాలకే పరిమితం కాకూడదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలు ఎదిగినప్పుడే సమాజంలో అంతరాలు తగ్గుతాయి. స్థానిక వనరుల కేంద్రంగా వ్యాపార అభివృద్ధి జరగాలి. స్కిల్ డెవలప్మెంట్ కోసం సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు దృష్టి పెట్టారు. గ్రామీణ ప్రాంతాలకు ఐటీని విస్తరిస్తున్నారు. సవాళ్లు ఎదురైనప్పుడు పారిపోకూడదు. సవాల్ల ను చాలెంజ్గా తీసుకొని మహిళలు నిలదిక్కుకోవాలి. మహిళా భద్రత, సాధికారత కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను మా ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది. ప్రయాణాలు, పని ప్రాంతాల్లో మహిళా భద్రత కోసం టి సేఫ్ యాప్ తీసుకొచ్చాం. ఇతర రాష్ట్రాలకు టి సేఫ్ ఆదర్శంగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచాలి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అంకితభవంతో మీ సేవలను అందించాలి. ఒకరికొకరు ఆసరాగా ఉండి తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

# తిరుపతి లడ్డూ ప్రసాదంలో అపచారం అక్కడే జరిగిందా..?



✍ జయభేరి, తిరుమల, సెప్టెంబర్ 20:

తిరుమల శ్రీవారి లడ్డూపై సీఎం చంద్రబాబు చేసిన సంచలన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా దుమారం రేగింది. ప్రస్తుతం అన్ని మీడియా సంస్థల్లో చర్చ నడుస్తోంది. కొంతమంది చంద్రబాబు వ్యాఖ్యలపై ఆరోపణలు చేస్తుండగా.. మరోవైపు వైసీపీ హయాంలో జరిగింది వాస్తవమేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తరుణంలో పలు ఆసక్తికర విషయాలు బయటకు వచ్చాయి. 50 ఏళ్లుగా తిరుమల లడ్డూలో ఉపయోగించే కర్ణాటకకు చెందిన కేఎంఎఫ్‌కి చెందిన నందిని నెయ్యిని జగన్ రెడ్డి ఎందుకు ఉన్నట్లు ఉండి తొలగించాడో ఇప్పుడు అర్థమైందా ? అంటూ టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. తిరుపతి లడ్డూ తయారీకి 50 ఏళ్లుగా సరఫరా చేస్తున్న నందిని నెయ్యిని కాదని, తమిళనాడు కంపెనీకి ఎందుకు ఇచ్చాడో, ఇప్పుడు ప్రజలకు తెలిసింది. 50 ఏళ్లుగా నాణ్యతతో కూడిన నందిని నెయ్యిని జగన్ ఎందుకు వద్దు అన్నాడు ? తక్కువ ధరకు నెయ్యి అంటూ, నాణ్యత లేని నెయ్యి తీసుకొచ్చి, తిరుమల లడ్డూకి రుచి లేకుండా చేయడం వెనుక జగన్ రెడ్డి చేసింది కుట్ర కాక మరేంటి ? అంటూ ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, తిరుమల లడ్డూపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఏపీసీసీ చీఫ్ షర్మిల మండిపడ్డారు. తిరుమల లడ్డూ తయారీలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు వాడారంటూ సీఎం చంద్రబాబు ఎలా మాట్లాడుతారని ఆరోపించారు. ఏకంగా వేంకటేశ్వరుడికి మచ్చతెచ్చేలా సీఎం మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా ఉపయోగిస్తే.. తక్షణం విచారణ కమిటీ వేయాలని చెప్పారు. దీంతోపాటు సీబీఐ విచారణ జరిపించాలని షర్మిల డిమాండ్ చేశారు. తిరుమలను అపవిత్రం చేసిన నీచులెవరో నిగ్గుతేల్చాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. అలాగే, లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. దీనిపై తన కుటుంబంతో సహా ప్రమాణం చేయడానికి సిద్ధమేనని సవాల్ విసిరారు. అంతకుముందు, తిరుమల లడ్డూపై సీఎం చంద్రబాబు మంగళగిరిలో కూటమి ప్రభుత్వ శాసనసభాపక్ష సమావేశంలో ఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల ప్రసాదంలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు వాడారని ఆరోపణలు చేశారు. అలాగే జగన్ హయాంలో తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. దేవుడి దగ్గర పెట్టే ప్రసాదాలను అపవిత్రం చేయడంతోపాటు తిరుమలలో దుర్మార్గంగా వ్యవహరించిందంటూ మండిపడ్డారు. ముఖ్యంగా భక్తులకు నాసిరకం లడ్డూలు, నాణ్యతలేని అన్నప్రసాదం పంపిణీ చేసిందంటూ ఆరోపించారు. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యిని వినియోగిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలకు రాష్ట్ర మీడియాతో పాటు దేశ వ్యాప్తంగా దుమారం రేగుతోంది. దేవదేవుడైన శ్రీ వేంకటేశ్వరుని లడ్డూ ప్రసాదాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. అలాంటి లడ్డూ తయారీలో వైసీపీ హయాంలో జంతువుల కొవ్వు వాడారన్న సంచలన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు బయట పెట్టారు. ఈ అంశం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఓ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఊరకనే ఆరోపణలు చేయరు. బలమైన ఆధారాలు ఉండబట్టే చేసి ఉంటారని భావిస్తున్నారు. దానికి తగ్గట్లుగానే అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏపీలో ప్రభుత్వం మారిన వెంటనే టీటీడీ ఈవో సీనియర్ ఐఏఎస్ శ్యామలరావును ప్రభుత్వం నియమించింది. అప్పటి వరకూ కేంద్ర రక్షణ శాఖ ఉద్యోగిగా ఉన్న ధర్మారెడ్డి ఈవోగా ఉన్నారు. ఆయనకు అర్హతలు లేకపోయినా ఆ పోస్టు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. శ్యామలరావు ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే లడ్డూ ప్రసాదంపై వస్తున్న ఆరోపణలపై దృష్టి పెట్టారు. వెంటనే.. లడ్డూ ప్రసాదానికి వాడుతున్న పదార్థాలను తనిఖీ చేయించారు. నెయ్యిని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ లో టెస్టు చేయించారు. ఫలితాలు ఏమిటో బయట పెట్టలేదు కానీ.. వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టేశారు. బహుశా.. ఆ నివేదికలో జంతువుల కొవ్వు ఉందన్న రిపోర్టు వెలుగులోకి వచ్చి ఉంటుందని.. దాన్ని సీఎంకు తెలియచేసి ఉంటారని భావిస్తున్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అత్యంత క్వాలిటీతో ఉన్న పదార్థాలతోనే సరఫరా చేస్తారు.

గత ఇరవై ఏళ్లకుగా కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యిని మాత్రమే వాడుతున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందిని బ్రాండ్ కు చెల్లిస్తున్న ధర కంటే తక్కువ ధరను నిర్ణయిస్తూ టెండర్లు పిలిచారు. ఆ ధర ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని నష్టాలు వస్తాయని నందిని టెండర్లలో పాల్గొనలేదు. ఈ కాంట్రాక్టులను.. యూపీకి చెందిన రెండు సంస్థలు దక్కించుకున్నాయి. ఆ సంస్థలు నెయ్యి ఎలా తయారు చేస్తాయన్నది పట్టించుకోలేదు. ప్రీమియర్ అగ్రి ప్రొడక్ట్స్, క్వాలిటి లిమిటెడ్ వంటి కంపెనీలకు ఇచ్చారు. నిజానికి ఇలాంటి నెయ్యి పేరు మోసిన డెయిరీలే సిద్ధం చేయగలవు. వీరు ఇచ్చే నెయ్యి క్వాలిటీని స్వతంత్ర సంస్థలతో కాకుండా తామే పరీక్షిస్తామని టీటీడీ అధికారులు ప్రకటించారు. నిజానికి శ్రీవారి లడ్డూలు తయారు చేయడానికి అవసరమైన అత్యంత నాణ్యమైన నెయ్యి.. ఆ యూపీ కంపెనీలు సరఫరా చేసినంత తక్కువ ధరకు రావు. కేవలం నందిని బ్రాండ్ నెయ్యి టెండర్లలో పాల్గొనకుండా చేయడానికే ఆ ధరను నిర్ణయించి ఉద్దేశపూర్వకంగా ఆ కంపెనీని తప్పించారని.. తమకు ఇష్టమైన కంపెనీలకు నెయ్యి సరఫరా టెండర్లు దక్కేలా చేశారని అప్పట్లోనే టీడీపీ ఆరోపణలు గుప్పించింది. కానీ టీటీడీలో ప్రతిదీ తాము టెండర్ల ద్వారానే కొనుగోలు చేస్తామని చెప్పి టీటీడీ ఆ నెయ్యినే కొనుగోలు చేసింది. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు రక్షణ శాఖ ఉద్యోగిగా ఉన్న ధర్మారెడ్డినే కీలకంగా వ్యవహరించారు.

### ప్రసాదంలో కల్తీ..

కల్తీ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరింది. లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డ తెలిపారు. వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిందిగా కోరినట్లు వివరించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ అంశంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

**లడ్డూపై వివాదం**

కాగా, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం ఇప్పుడు దుమారం రేపుతున్నది. వైసీపీ హయాంలో లడ్డూ తయారీ కోసం జంతు కొవ్వు వినియోగించారని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. లడ్డూ కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ గుజరాత్ (ఎన్‌డీడీబీజీ) సీఏఎల్ఎఫ్ ల్యాబ్ కూడా నిర్ధారించింది. ఈ ఏడాది జూలైలో లడ్డూను ల్యాబ్‌కు పంపగా, అదే నెల 17న నివేదిక వచ్చింది. ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం.. లడ్డూలో ఆవు నెయ్యి, సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మకజొన్న, పత్తి గింజలతోపాటు చేపనూనె, జంతు కొవ్వు, పామాయిల్, పంది కొవ్వు కూడా వాడారు. ఆ రిపోర్టును గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మీడియాకు విడుదల చేశారు.

**జగన్‌పై ఫిర్యాదు..**

ఇక ఈ అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హిందువుల ఆత్మను హత్య చేశారని వినీత్ జిందాల్ మండిపడ్డారు. హిందువుల నమ్మకాలను, విశ్వాసాలను, ఆలయం పవిత్రతను దారుణంగా దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా, కావాలనే ఇలాంటి చర్యలకు జగన్ మోహన్ రెడ్డి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ క్రమంలోనే జగన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

### కల్తీ జరిగిన మాట వాస్తవమే

నుంచి నెయ్యి కొనుగోలును ఆపివేశామని పేర్కొన్నారు. శుక్రవారం టీటీడీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లడ్డూ కల్తీపై వివరాలను వెల్లడించారు. తిరుమల ఆలయాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని, అటువంటి చోట కల్తీ జరగడం దారుణమన్నారు. ఏపీలో అధికార మార్పిడి జరిగిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈవోగా బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. లడ్డూ నాణ్యత, ప్రమాణాలు తగ్గాయని భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి తన దృష్టికి తీసుకొచ్చారని వెల్లడించారు. గత జులై నెలలో లడ్డూలో ఉపయోగించే నెయ్యిని సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లతో సమావేశమై శుద్ధమైన నెయ్యి ని సరఫరా చేయాలని సూచించామని పేర్కొన్నారు. రూ. 320కు రూ. 411 కే కిలో నెయ్యిరాదని అందరు చెబుతున్నందునే అనుమానం వచ్చి జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న ప్రభుత్వ ఎన్‌డీడీబీ (నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు) ల్యాబ్‌కు జులై 6న రెండు, జులై 12 న మరో రెండు ట్యాంకర్ల శాంపుల్లను పంపామని తెలిపారు. వారి నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ఏఆర్ ఫుడ్స్ కంపెనీ నుంచి వస్తున్న నెయ్యిలో ప్రమాణాలు లేవని, జంతువుల కొవ్వును వాడుతున్నారని నివేదిక ఇచ్చిందని ఆయన వెల్లడించారు. టీటీడీ కి సొంత ల్యాబ్ లేకపోవడంతో సరఫరాదారుల నుంచి వచ్చిన నెయ్యిని పరీక్షించలేకపోయారని ఈవో అన్నారు. దీంతో సరఫరాదారులకు కల్తీనెయ్యి సరఫరా వరంగా మారిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో ప్రస్తుతం నాణ్యమైన లడ్డూ భక్తులకు అందుతుందని తెలిపారు. నెయ్యి నాణ్యతను తెలుసుకోవడానికి అడల్ట్రీ ల్యాబ్ టెస్ట్ ఇక్విప్‌మెంట్‌ను విరాళంగా ఇచ్చేందుకు ఎన్డీబీబీ ముందుకు వచ్చిందని, విదేశాల నుంచి యంత్రాలు రావాల్సి ఉందని తెలిపారు.

## వైసీపీని వణికిస్తున్న తిరుపతి లడ్డూ ఇష్యూ

✍ జయభేరి, తిరుపతి, సెప్టెంబర్ 20:

ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు దేవదేవుడు శ్రీనివాసుడు. ఆయనను ఒక్క క్షణం దర్శనం చేసుకుని ఒక్క ముక్క లడ్డూ ప్రసాదాన్ని నోట్లో వేసుకునే భాగ్యం కోసం ఖండాంతరాలు దాటి వస్తారు. కొండపై ఎన్ని గంటలైనా క్యూ లైన్లలో ఎదురు చూస్తారు. అలాంటి చోట యంత్రాంగం భక్తుల విశ్వాసాలను కాపాడేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ ప్రసాదం తయారీ కోసం వాడిన నెయ్యి విషయంలో బయటకు వచ్చిన సంచలన నిజాలు హిందూ సమాజన్ని నివ్వెర పరుస్తున్నాయి. ఇప్పుడి నిందలన్నీ వైసీపీ మీదనే పడుతున్నాయి. సమర్థించుకునేందుకు తంటాలు పడాల్సి వస్తోంది. పాలన ప్రారంభించి వంద రోజులు అయిన సందర్భంగా ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రబాబు వైసీపీ పాలనలో జరిగిన దురాణాలను సరి చేస్తున్నామని చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో తిరుమలలో జరిగిన ఘోరాన్ని బయట పెట్టారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యిని వాడారన్నారు. చంద్రబాబు బయట పెట్టిన మాటలు సంచలనం సృష్టించాయి. దేశవ్యాప్తంగా హిందువుల మనోభావాలకు సంబంధించిన అంశం కావడంతో.. దుమారం రేగింది. వైసీపీ నేతలు అప్పటికప్పుడు ఎదురుదాడికి దిగారు. చంద్రబాబు ఘోరం చేస్తున్నారని మండిపడ్డారు. దమ్ముంటే ఆధారాలు బయట పెట్టాలని సవాల్ చేశారు. దమ్ముంటే ఆధారాలు బయట పెట్టాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రెస్ మీట్ పెట్టి మరీ సవాల్ చేశారు. ఆ తర్వాత కాసేపటికే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ప్రెస్ మీట్ పెట్టి ల్యాబ్ రిపోర్టులు విడుదల చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే తిరుమలలో లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో క్వాలిటీ ఎందుకు తగ్గిపోయిందో పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు ముగ్గురు నిపుణులతో కమిటీని నియమించారు. ఆ తర్వాత ఈవో శ్యామలరావు.. సరఫరా చేస్తున్న పదార్థాలన్నింటినీ దేశంలో పేరెన్నికగన్న ల్యాబుల్లో టెస్టులకు పంపించారు. నెయ్యి విషయంలో వచ్చిన రిపోర్టును చూసిన వెంటనే.. మొత్తం ఆ నెయ్యి వాడకాన్ని నిలిపివేసి.. ఆ కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టారు. ఇప్పుడు ఆ ల్యాబ్ రిపోర్టు విషయంలో వైసీపీ ఎదురుదాడికి దిగడం తప్ప మరో మార్గం లేదు. నిజానికి ఈ వ్యవహారంలో మొత్తం ఏం జరిగిందో ఆధారాలతో సహా సేకరించిన తరవాతనే చంద్రబాబు బయట పెట్టారని తెలుస్తోంది. ఈ విషయంలో నెయ్యి కాంట్రాక్ట్ పొందిన సంస్థల్లో ఒకటైన అల్ఫా కంపెనీ.. విదేశాల నుంచి బటర ఆయిల్ ను దిగుమతి చేసుకుంది. నెయ్యిలో కల్తీ చేసి టీటీడీకి సరఫరా చేసింది. దీనికి సంబంధించిన పూర్తి సాక్ష్యాలు టీటీడీ వద్ద ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో విచారణ జరిపించి అందరిపై చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి కుటుంబం క్రిస్టియానిటీని పాటిస్తుంది. వారింట్లో అందరూ క్రిస్టియన్లే. జగన్ కూడా ఎన్నికల్లో గెలవగానే జెరూసలేం వెళ్లి వచ్చారు. ఎలా చూసినా ఆయన అన్యమతస్తుడని టీడీపీ నేతలు విమర్శలు చేస్తూ ఉంటారు. హిందూ దేవుళ్ల ప్రసాదాలను క్రిస్టియన్లు తినరు. సీఎంగా ఉన్నప్పుడు బ్రహ్మోత్సవాలకు హాజరైన ఆయన ప్రసాదం తినడం ఎప్పుడూ చూడలేదని టీడీపీ నేతలు విమర్శిస్తూ ఉంటారు.

## లడ్డూల్లో పవిత్రమైన నెయ్యిని కల్తీ చేయడం బాధ

✍ జయభేరి, తిరుమల, సెప్టెంబర్ 20:

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై టీటీడీ మాజీ ప్రధానార్చకులు రమణ దీక్షితులు శుక్రవారం స్పందించారు. పవిత్రమైన ఆవు నెయ్యిని కల్తీ చేసి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించడం అపచారమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో ప్రసాదాల నాణ్యతపై గతంలో ఎన్నోసార్లు టీటీడీ ఛైర్మన్, ఈవో దృష్టికి తాను తీసుకెళ్లానని.. అయినా ఫలితం లేకపోయిందని మీడియా సమావేశంలో చెప్పారు. ఈ రెండు మూడు రోజుల్లో వస్తున్న వార్తలు చాలా బాధగా ఉందని.. శ్రీవారి భక్తులకు తీవ్ర మనోవేదన కలిగించాయని అన్నారు. 'నైవేద్యాలు, లడ్డూల్లో పవిత్రమైన నెయ్యిని కల్తీ చేయడం బాధ కలిగించింది. ప్రసాదాల నాణ్యతపై చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లాను. కానీ నాది ఒంటరి పోరాటమే అయ్యింది. తోటి అర్చకులు ఎవరూ తమ వ్యక్తిగత కారణాల వల్ల ముందుకు రాలేదు. దీంతో గత ఐదేళ్లూ నిరభ్యంతరంగా ఈ మహాపాపం జరిగిపోయింది. నెయ్యి పరీక్షలకు సంబంధించి ల్యాబ్ రిపోర్టులు చూశాను. నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు అందులో బహిర్గతమైంది. పరిశుభ్రమైన ఆవు పాలతో తయారైన నెయ్యిలో కొవ్వు పదార్థాలు కలిసేందుకు వీలు లేదు.' అని రమణ దీక్షితులు పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రక్షాళన దిశగా ఎన్నో చర్యలు చేపట్టారని రమణ దీక్షితులు అన్నారు. 'కర్ణాటకలోని నందిని డెయిరీ నుంచి నాణ్యత ఉన్న నెయ్యిని వినియోగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇది శుభ పరిణామం. గతంలో లడ్డు తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యి అంశంపై పూర్తిస్థాయి విచారణ జరగాలి. కల్తీ, స్వామి వారి కైంకర్యాలు గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తే గతంలో నాపై కేసులు పెట్టారు. నేను ఎన్ని ఇబ్బందులు పడినా నా స్వామి వారికి సమయానికి నైవేద్యం, కైంకర్యాలు జరిగితే చాలు. కైంకర్యాలు, ప్రసాదాల్లో లోపాలు జరిగాయి. ఈ కల్తీ జరగడం వల్ల మా చేతుల మీద జరగడం చాలా దురదృష్టకరం. ఆగమ శాస్త్రం, దిట్టం ప్రకారం ప్రసాదాలు చేయాలి. దిట్టం కన్న తక్కువ చేస్తే అది అపచారం. స్వామి వారికి నాణ్యత, రుచిగా నైవేద్యం పెడితే భక్తులను అనుగ్రహిస్తారు. సేంద్రీయ వ్యవసాయం బియ్యంతో నైవేద్యం పెట్టకూడదని గతంలోనే చెప్పాను. వందల సంవత్సరాలుగా వస్తోన్న ఆచారం మార్చవద్దని చెప్పాను. గతంలో అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి ఘటనలు జరిగి ఉండవు.' అని రమణ దీక్షితులు పేర్కొన్నారు. కాగా, తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం జరిగిందని సీఎం చంద్రబాబు తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై తీవ్ర రాజకీయ దుమారం రేగింది. దీనికి సంబంధించిన రిపోర్టులను తాజాగా టీడీపీ నేత ఆనం బయటపెట్టారు. జగన్ హయాంలో టీటీడీ లడ్డూల తయారీలో వాడే నెయ్యిలో.. పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె వంటివి కలగలిసి ఉండొచ్చనే అనుమానాన్ని గుజరాత్‌కు చెందిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు కాఫ్ లిమిటెడ్ సంస్థ వ్యక్తం చేసినట్లు టీడీపీ తెలిపింది. నెయ్యి పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని.. అందులో పాలకు సంబంధించినవి కాకుండా ఇతరత్రా కొవ్వులు కలగలిసి ఉన్నట్లు ఆ పరీక్షల్లో వెల్లడైనట్లు పేర్కొంది. మరోవైపు, ఈ అంశంపై టీటీడీ విచారణకు ఆదేశించింది.

# కమ్యూనిస్టుల పాత్రను చెరిపేస్తే ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఉద్ధృతం చేస్తాం..

- దేశంలో వందేళ్ళ ఘన చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ
- సాయుధ పోరాట స్పూర్తితో ఉద్యమాలు చేస్తూనే ఉంటాం.
- తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు
- రాజకీయ కాంక్షతో బజారునపడి తన్నుకుంటున్న ఎమ్మెల్యేలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 20 :**

తెలంగాణ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులు కాగా, పోరాటాలు, త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం గజ్వేల్ లో జిల్లా కార్యదర్శి మంద పవన్ అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని, అయితే ఆ పోరాటాన్ని హిందూ ముస్లింల మధ్య జరిగిన గొడవగా బిజెపి పార్టీ వక్రీకరిస్తుందని ఆరోపించారు. 4500 మంది కమ్యూనిస్టు అమరుల రక్తతర్పణంతో నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగిందని, అయితే హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసినప్పటికీ సిపిఐ బలోపేతం కాకుండా నాటి నెహ్రూ, పటేల్ సేనలు ఇక్కడి కమ్యూనిస్టులపై యుద్ధం ప్రకటించినట్లు చెప్పారు. బ్రిటిష్ ముష్కరుల పాలన నుండి భారతదేశానికి ఆగస్టు 15, 1947 న స్వాతంత్ర్యం వచ్చినప్పటికి హైదరాబాద్ సంస్థానా నిజాం నవాబు తమ ఆధీనంలో పెట్టుకుని హైదరాబాద్ ప్రత్యేక దేశంగా పాలన సాగిస్తూ దొరలు, దేశముఖ్ లు, జమిందార్ లు, జాగిర్ధార్లను, రజాకార్లతో తెలంగాణ ప్రజలను పన్నుల రూపాల్లో, చిత్రహింసలకు గురి చేస్తున్న రోజుల్లో బద్ధం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, మాక్ధూమ్ మోహినోద్దీన్, అనభేరి ప్రభాకర్ రావు తదితర కమ్యూనిస్ట్ నాయకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాతానికి పిలుపునిచ్చి ప్రజల చేత బందుకులు పట్టించి నిజాం పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం బీకర పోరాటం చేసినట్లు తెలిపారు. దున్నే వాడికి భూమి ఇవ్వాలని 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత సీపీఐ పార్టీదని, భారత కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో 4500 మంది అమరుల ప్రాణత్యాగంతో నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు స్వాతంత్రం సిద్ధించిందని అన్నారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ తోపాటు కొన్ని పార్టీలు ఈ చరిత్రను వక్రీకరిస్తున్నాయని, హిందూ, ముస్లింల గోడవగా, వల్లభాయ్ పటేల్ సైనిక చర్యతో భారత దేశంలో హైదరాబాద్ ను విలీనం చేసారని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరులను స్మరించుకుంటూ వారి యొక్క పోరాట స్పూర్తితో యువ కమ్యూనిస్టులు పాలక ప్రభుత్వాల విధానాలపైన పోరాటాలు నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా ప్రస్తుత రాజకీయాలు భ్రష్టపట్టి పోగా, ఎమ్మెల్యేలు రాజకీయకాంక్షతో బజారున పడి తన్నుకుంటున్నట్లు ఎద్దేవా చేశారు. దేశంలో సిపిఐ పార్టీకి మరణం లేదని, మరి కొద్ది రోజుల్లోనే వందేళ్ళ సంబురాలు నిర్వహించుకోనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ప్రకాష్ రావు, దయానంద రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేష్, కిష్టపురం లక్ష్మణ్, అందే అశోక్, నాయకులు స్వర్గం రాజేశం, చింత శ్రీను, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, మూన్వర్ జాన్, పద్మ, రజిని, మమత, కొయ్యడ కొమురయ్య, మంద శ్రీను, రూపేష్, సుధాకర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జేరిపోతుల జనార్ధన్, సంగెం మధు, రామగళ్ల నరేష్, వేల్పుల ప్రసన్నకుమార్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు. కాకా మొదటగా ప్రజ్ఞాపూర్ హరిత హోటల్ నుండి గజ్వేల్ వరకు సిపిఐ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే సాంబశివరావుకు భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు.





## కుటుంబానికి అండగా అంజన్న

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 20:**

ములుగు కేంద్రంలోని బీసీ కాలనీలో నివాసముండే నర్సయ్య చనిపోవడంతో విషయం తెలుసుకున్న మెదక్ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హరిబాబు, బిఆర్ఎస్ నాయకులు నగేష్ తదితరులు పాల్గొన్నారు

## 100 రోజులు పాలనలో ఎన్డీఏ మంచి ప్రభుత్వం



**జయభేరి, కైకలూరు, సెప్టెంబర్ 20:**

కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం ఆవుకూరు గ్రామంలో ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పెన్షన్, అన్న క్యాంటీన్ గ్రామములో ఇంటింటికి వెళ్లి రూ. 3000 పెన్షన్ రూ. 4000 పెంచుతూ.. రూ. 3000 వికలాంగుల పెన్షన్ రూ. 6000కు పెంచుతూ వంద రోజులలో నిర్వహించిన సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించిన కైకలూరు నియోజకవర్గంలో కలిదిండి మండలం ఆవుకూరు గ్రామం టిడిపి అధ్యక్షులు చంద్రకళాధరావు ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామ అధికారి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

- విద్యుత్ వినియోగదారులు సహకరించాలని - ఏఈ సురేందర్



**జయభేరి, సెప్టెంబర్ 20:**

మేడ్చల్ జిల్లా బొమ్మరాశిపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా ఈ నెల 21 న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని శామీర్ పేట విద్యుత్ ఏ ఈ సురేందర్ తెలిపారు. బొమ్మరాశిపేట ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రామానికి మరియు వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే దేవరయంజాల్ లోని 11 కేవీ DMC ఫిడర్ vadda మేయింటనేన్స్ పనుల కారణంగా దేవారయాంజాల్ లోని గోడౌన్ లు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని వెల్లడించారు. ఈ అంతరాయన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో లెంకల లక్ష్మీ పుట్టినరోజు సందర్భంగా మహాలక్ష్మి వయో వృద్ధుల ఆశ్రమం లో వృద్ధులకు పండ్లు, మధ్యాహ్నం భోజనం ను ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులను ఉదేశించి పాఠశాల చైర్మన్ లేంకల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నానాటినుండే సేవా దృక్పదాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధ ఆశ్రమం అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, సూపర్వైజర్ జానకి ,హెడ్మాస్టర్ కె వెంకట్ రెడ్డి, రామకృష్ణ, సుభాన్ అలి,జమీరుద్దీన్, కుమారస్వామి, దీప్తి,అప్సర్ బేగం, అంజమ్, భాగ్యలక్ష్మి, అంకిత, అనీస్ బేగం,రజిత, కార్తీక,అనితా విద్యార్థిని విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

- ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా అధికారులకు వినతి పత్రం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా, వినతి పత్రం అందజేసి ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతు బీసీ జన కుల గణన కులాల వారిగా సమగ్ర కులగనన చేసి జనాభా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి. గత మూడు సంవత్సరాల నుంచి విద్యార్థుల యొక్క ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా పాలకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. నిరుపేద విద్యార్థులైనటువంటి ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ అన్ని వర్గాల విద్యార్థులకు చదువుకోవడానికి ఆటంకం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. ప్రైవేటు కళాశాల యజమానాలు కూడా అధ్యాపకులకు జీతాలు లేకపోవడం వల్లనా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం ఆలోచించి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని యెడల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చోల్లేటి భాస్కరాచారి, బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఏకుల రాజారావు,రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళి, కొండ లలిత, గౌరోజు బ్రహ్మచారి, తూటుపల్లి శ్రీనివాసులు,బొమ్మిడి వెంకటయ్య,కోటేశ్వర్,వనం బుచ్చయ్య, ముసిని వీరయ్య, ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలు లెక్చరర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవా

- స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీలోని 4వ మరియు 6వ నందు డోర్ టు డోర్ ప్రచారంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, తడిచెత్త, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను కంపోస్టు ఎరువు తయారు చేయడం పొడి చెత్తను మున్సిపాలిటీ స్వచ్ఛ ఆటోకు ఇచ్చే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్కు నాయక్, వార్డ్ అధికారులు, మెప్మా స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల ఆందోళన

- తమకు ప్రభుత్వం కేటాయించిన భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపణ
- భూమిని సర్వే చేయించి గీత కార్మికులకు న్యాయం చేయాలి - డీ జీ సాయిలు గౌడ్



**జయభేరి, సెప్టెంబర్ 20:**

గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశద్ధితో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ప్రధాన కార్యదర్శి డీ.జీ సాయిలు గౌడ్, మేడ్చల్ జిల్లా గీత పనివారల సంఘం కార్యదర్శి డీ.జీ నరేంద్ర ప్రసాద్ లు డిమాండ్ చేశారు. మూడు చింతల పల్లి మండలం అద్రాస్ పల్లి గ్రామంలో గీత కార్మికుల కోసం భూమిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ మండల తహసీల్దారు కార్యలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసిల్దార్ వెంకట నర్సింహారెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్రాస్ పల్లి గ్రామంలో 2015 సంవత్సరంలో హరితహారం కింద ప్రభుత్వం మరియు ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ సిబ్బంది కలిసి మొక్కలు నాటారనీ, కాగా ఇందులో గీత కార్మికులు ఎంతో కష్టపడి బోర్లు వేసి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మొక్కలు పెంచారని అన్నారు. అయితే ప్రస్తుతం ఈ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ భూమిని సర్వే చేయించి గీత కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు లింగోల్ల హనుమాన్ దాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మల నరసింహ, డి.హెచ్. పి.ఎస్.రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.సహదేవ్, షామీర్పేట్ మండల కార్యదర్శి డి.జి. నరేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి ఓంకార్ మురళీధర్ రాజు, ఆద్రాస్ పల్లి సంఘం అధ్యక్షులు రంగా నగేష్ గౌడ్, ఉపాధ్యక్షులు గంగల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేష్ గౌడ్, రంగా భాస్కర్ గౌడ్, కమిటీ సభ్యులు, రంగా శేఖర్, గంగల కృష్ణ, రంగా మహేష్, రంగ నరసింహ, గంగల రమేష్, ఆర్.స్రవన్. మహిళా సమాఖ్య నాయకులు, రంగాజ్యోతి, రంగ పోచమ్మ,రంగ పెంటమ్మ ,గంగల లావణ్య, రంగా పూజ, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# ఎక్సలెన్షియా పాఠశాలలో CBSE -7 బాలికల బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

- పోటీలను ప్రారంభించిన అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి పుష్ప సింతల్





**జయభేరి, సెప్టెంబర్ 20:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ లోని ఎక్సలెన్షియా పాఠశాలలో CBSE7 బాలికల బాస్కెట్ బాల్ ఆటల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీల కార్యక్రమానికి భారతదేశం తరపున అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారిని పుష్ప సింతల్ కుమార్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నార్మన్ ఇస్సాక్ ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఆటలో గెలుపు ఓటములు సహజం అని, క్రీడలు జీవితంలో క్రమశిక్షణ, ఒదిగి ఉండడం నేర్పుతాయని అన్నారు , ఓటమి అనేది గెలుపుకు నాంది అని, ప్రతి ఒక్కరు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ వెంకట్ మురికి మాట్లాడుతూ తమ కళాశాలలో టోర్నమెంట్ నిర్వహించడం ఎంత సంతోషగా ఉందని అన్నారు. ఈ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల చెందిన విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు.రెండు తెలుగు రాష్ట్రాల నుండి అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాలలో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎక్సలెన్సీ కళాశాలలో భారతదేశంలో ఉన్న వివిధ క్రీడలు పోటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎక్సలెన్షియా సీఈఓ ఈశ్వరన్ , బాయ్స్ క్యాంపస్ సెంటర్ హెచ్వోడి రమేష్ ,ప్రిన్సిపల్ నీరజ కౌశిక్ , సీబీఎస్ఈ ఫౌండేషన్ అకాడమిక్ హెడ్ ఏక్ నాథ్ పాఠశాల అధ్యాపకలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి



# కేరళను వణికిస్తున్న వైరస్‌లు

**తిరువనంతపురం, సెప్టెంబర్ 20:**

కేరళను వైరస్‌లు వణికిస్తున్నాయి. ఇప్పటికే.. మంకీ పాక్స్ కేరళను షేక్ చేస్తుండగా.. నిఫా వైరస్ మళ్లీ కలకలం సృష్టిస్తోంది. అంతేకాదు.. ఒకే వ్యక్తిలో అటు నిఫా.. ఇటు మంకీపాక్స్ లక్షణాలు బయటపడుతుండడం కేరళను మరింత కుదిపేస్తోంది. మంకీ పాక్స్.. నిఫా వైరస్ వ్యాప్తితో కేరళతోపాటు సరిహద్దు రాష్ట్రాలు అలెర్ట్ అయ్యాయి. తమిళనాడు కేరళ బోర్డర్‌లో హైఅలెర్ట్ ప్రకటించి తనిఖీలు ముమ్మరం చేయడం కలకలం రేపుతోంది.కరోనా తగ్గిందిలే అనుకునే లోపే.. వరుస వైరస్‌లు ప్రపంచాన్ని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం వరల్డ్ వైడ్‌గా పలు దేశాలను వణికిస్తోన్న నిఫా వైరస్, మంకీపాక్స్ మనదేశంలోనూ హడలెత్తిస్తున్నాయి. ప్రధానంగా.. కేరళను ఆ రెండు వైరస్‌లు కలవరపెడుతున్నాయి. ఇటీవల యూఏఈ నుంచి వచ్చిన 38 ఏళ్ల వ్యక్తికి మంకీపాక్స్ వైరస్ సోకినట్లు కేరళ వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన ఆయన మంకీపాక్స్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరినట్లు తెలిపింది. మంజేరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని శాంపిల్స్‌ను కోజికోడ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపగా.. పాజిటివ్‌గా తేలింది. దాంతో.. దేశంలో రెండో మంకీపాక్స్ కేసు రికార్డ్ అయింది. అలెర్ట్ అయిన కేరళ అధికారులు.. దుబాయ్ నుంచి వచ్చిన ఆ వ్యక్తి ఎవరెవర్ని కలిశారో వారిని ట్రేస్ చేసే పనిలో పడ్డారు. 16మందిని గుర్తించి ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. ఈనెల 9న తొలి మంకీపాక్స్ కేసు నమోదు అయింది.ఒకవైపు కేరళను మంకీపాక్స్ వణికిస్తుండగా.. ఇప్పుడు నిఫా వైరస్ మళ్లీ తెరపైకి వచ్చింది. తాజాగా.. ఒక వ్యక్తికి నిఫా వైరస్ నిర్ధారణ కావడం కలకలం రేపుతోంది. అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. అతనితో కలిసి ఉన్న 268 మందిని ఐసొలేషన్‌లో ఉంచారు కేరళ అధికారులు. వారిలో 81 మంది హెల్త్ కేర్ వర్కర్స్, 177మంది ప్రైమరీ కాంటాక్ట్ ప్రజలు, 90మంది సెకండరీ కాంటాక్ట్ ప్రజలుగా గుర్తించారు. అయితే.. ప్రైమరీ కాంటాక్ట్ లిస్టులోని 134మందిని వైద్యులు హైరిస్క్ కేటగిరిలో ఉంచారు. ఇద్దరికి నిఫా లక్షణాలు ఉన్నట్లు తేలడంతో స్థానిక మంజేరి మెడికల్ కాలేజ్‌కు తరలించారు. వీళ్లిద్దరితోపాటు మొత్తం ఎనిమిది మందికి అక్కడ చికిత్స అందిస్తున్నారు. మరో 21మందిని పేరింతల్‌మన్నా ఆస్పత్రిలో జాయిన్ చేశారు.ఇదిలావుంటే.. కేరళలోని మలప్పురంలో నిఫా వైరస్‌తోపాటు.. మంకీ పాక్స్ లక్షణాలున్న వ్యక్తులను గుర్తిస్తున్నారు అధికారులు. దానిలో భాగంగా.. తమిళనాడు కేరళ సరిహద్దు జిల్లాల్లో అలెర్ట్ ప్రకటించారు. కేరళ నుంచి కన్యాకుమారి ద్వారా తమిళనాడుకు వస్తున్న వాహనాలపై నిఘా పెంచారు. పూర్తి వైద్య పరీక్షల తర్వాతే కేరళ నుంచి తమిళనాడులోనికి ప్రజల్ని అనుమతిసతున్నారు. 24 గంటలపాటు తనిఖీలు నిర్వహించాలని, వైరస్ లక్షణాలున్న వారిని గుర్తించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దాంతో.. నాగర్‌కోయిల్‌లో ప్రత్యేక మెడికల్ క్యాంప్స్ కూడా ఏర్పాటు చేశారు. అలాగే.. సరిహద్దు జిల్లాల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు.నిఫా వైరస్ జంతువుల నుంచి నేరుగా మనుషులకు సోకుతుందని ఇప్పటికే అధికారికంగా తేలింది. తొలిసారి నిఫా వైరస్‌ను 1999లో గుర్తించారు. గబ్బిలాలు తిన్న పండ్లను తీసుకోవడం ద్వారా నిఫా వైరస్ మనుషుల్లోకి ప్రవేశిస్తుంది. ఇక.. వైరస్‌ల వ్యాప్తితో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. అన్ని దేశాలను అలెర్ట్ చేసింది. మరోసారి లాక్‌డౌన్ లాంటి పరిస్థితులు రాకుండా చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మొత్తంగా.. ఇటు మంకీపాక్స్.. అటు నిఫా వైరస్ వ్యాప్తితో కేరళ గజగజలాడుతోంది. వరుస కేసుల నమోదుతో భయపడిపోతోంది. అందులోనూ.. ఒకే వ్యక్తిలో రెండు రకాల వైరస్‌ల లక్షణాలు బయటపడుతుండడం మరింత భయాందోళనకు గురి చేస్తోంది.

# అమ్మో.. లేక్ వ్యూలా...



**హైదరాబాద్, సెప్టెంబర్20:**

హైడ్రా విచారణ ఎంతవరకు వచ్చింది. జలవనరుల శాఖ వద్ద నిర్మిస్తున్న అపార్టుమెంట్లు లోతుగా విచారణ చేస్తోందా? చెరువులను ఆక్రమించి వాటిని కడుతున్నారా? భారీ క్రేన్ల నిర్వాహకులతో హైడ్రా ఎందుకు సంప్రదింపులు చేస్తోంది? లేక్ వ్యూ భవనాలపై కన్నేసిందా? ఇవే ప్రశ్నలు లేక్ వ్యూ ప్రాంతల ప్రజలను వెంటాడుతోంది.హైదరాబాద్ సిటీలో లేక్ వ్యూ అపార్ట్‌మెంట్లకు మాంచి గిరాకీ ఉండేది. లేక్ సమీపంలో అపార్ట్‌మెంటు వుంటే చాలని బావించేవారు. ఇదంతా ఒకప్పుటి మాట. ప్రభుత్వాలు మారాయి.. పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. లేక్ వ్యూ అపార్ట్‌మెంట్ అంటే వద్ద బాబోయ్ అంటున్నారు వినియోగదారులు.లేక్‌లను కబ్జాను నిర్మిస్తున్న భారీ భవనాలను కడుతున్న విషయం ఆలస్యంగా వినియోగదారులకు అర్థమైంది. అలాంటి భవనాల వైపు ప్రస్తుతం చూడటం మానేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు కబ్జాలు ఆక్రమించి కడితే వెంటనే వాటిని కూల్చివేయాలని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో వినియోగదారులు ఆలోచనలోపడ్డారు.జలవనరుల శాఖ భవనాల సమీపంలో లేక్ ఉండేదని వాటిని కబ్జా చేసి నిర్మిస్తున్న.. నిర్మించిన భవనాల మాటేంటని ప్రత్యర్థుల నుంచి హైడ్రాకు ప్రశ్నలు వెల్లువెత్తాయి. పరిస్థితి గమనించిన హైడ్రా అధికారులు, వాటిపై లోతుగా విచారణ చేస్తున్నారు. మరోవైపు భారీ క్రేన్ల నిర్వాహకులతో మంతనాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ లెక్కన వాటిపై హైడ్రా కూల్చివేసే ఛాన్స్ ఉందంటూ అప్పుడు వార్తలు గుప్పుమన్నాయి. ~~లేక్ వ్యూ ప్రాజెక్టుల జాబితాలో బడా నిర్మాణ సంస్థలకు చెందిన ప్రాజెక్టులు~~న్నాయి. రెండుమూడు వేల ఫ్లాట్లతో ప్రాజెక్టులున్నాయి. చాలా లేక్ వ్యూ అపార్ట్‌మెంట్లు లేక్‌లను కబ్జా చేసి భవనాలు నిర్మించి నట్టు తేలిందట.జలవనరుల శాఖ భవనాల వద్దేకాదు.. రాయదుర్గం లేక్ వద్ద కూడా అదే పరిస్థితి వుందని అంటున్నారు. సిటీలోని లేక్ వ్యూ పరిసర ప్రాంతాల్లో అపార్టుమెంట్లపై దృష్టి సారించింది హైడ్రా. ఈ వారంలో వాటికి సంబంధించి విచారణ పూర్తి అవుతుందని అంటున్నారు.వచ్చేవారం హైడ్రా ఫీల్డ్‌లోకి రావచ్చని అంటున్నారు. ఈ క్రమంలో భారీ క్రేన్ల నిర్వాహకులతో మంతనాలు సాగిస్తుందని తెలుస్తోంది. గతంలో నొయిడా, కేరళలోనూ చెరువులను ఆక్రమించి కబ్జా చేసిన భారీ ఎత్తున భవనాలను కట్టేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో వాటిని అధికారులు కూల్చివేసిన విషయం తెల్సిందే.




# పోటా పోటీగా సాగిన లడ్డు వేలం పాట

## చెంగిచెర్ల, మహా గణపతి నగర్ లో ఘనంగా నిమజ్జన వేడుకలు

**✍ జయభేరి, మేడిపల్లి, సెప్టెంబర్ 20:**

మేడ్చల్ జిల్లా చెంగిచెర్ల, మహా గణపతి నగర్ లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో భాగంగా లడ్డు వేలం పాట నిర్వహించారు. పోటా పోటీగా సాగిన ఈ వేలం పాటలో చివరకు రూ. 275,000/ బాధ శ్రీనివాస్ , చంద్రలేఖ దంపతులు కైవసం చేసుకున్నారు. వేలం పాటలో లడ్డు దక్కించుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. గణేషుడు గంగమ్మ ఒడికి చేరాడు. మహాగణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. మహాగణపతికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. మహాగణపతి నిమజ్జనాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో కాలనీ జనసంద్రంగా మారిపోయింది. గతపతి బప్పా మోరియా నినాదాలతో పరిసరాలు మారుమ్రోగాయి. మహిళలు నృత్యాలు, కోలాటాలతో గణనాధుని సాధనంప్పినారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తాం

**ఉమ్మడి నల్లగొండ,నాగర్ కర్నూల్ జిల్లాలను సస్యశ్యామలం చేస్తాం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**

**దేవరకొండ :**



శ్రీశైలం ఎడమ కాలువ సొరంగ మార్గం (SLBC) ప్రాజెక్టు పనులను పరిశీలన చేసి ప్రాజెక్ట్ పురోగతి పైన సమీక్ష సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ MP కుందూరు రఘువీర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, ఉమ్మడి నల్గొండ జిల్లా MLA, MLC, జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులు. 1000 కోట్లతో పూర్తి అవ్వాల్సిన ప్రాజెక్ట్ ను గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్ట్ వ్యయం 4000కోట్లకు పెరిగి రాష్ట్ర ఖజానా పైన భారం పెరిగింది. గత ఏడాది మండుటెండల్లో మార్చి నుంచి జూలై వరకు నాలుగు నెలల పాటు రాష్ట్రంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర భాగంగా అన్ని ప్రాజెక్టుల దగ్గరకు వెళ్లి లెక్కలతో సహా రాష్ట్ర ప్రజలకు వివరించిన గౌరవ మల్లు భట్టివిక్రమార్క ఆ క్రమంలో SLBC దగ్గరకు సైతం వచ్చారు అని గుర్తు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేయడం లేదు,వచ్చేది ఇందిరమ్మ ప్రభుత్వమే అని అధికారంలోకి రాగానే ఇక్కడే కూర్చొని సమీక్ష చేసి SLBC ప్రాజెక్టును పూర్తి చేస్తామని నాడు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రకటించారు. ప్రజలందరి ఆశీస్సులతో అన్నట్టుగానే రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చింది అన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఆరు నెలలు ,ఏడాది,రెండు సంవత్సరాలు, ఐదు సంవత్సరాలలో పూర్తయ్యే ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించి ముందుగా పూర్తయ్యే ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నాం అని పేర్కొన్నారు. SLBC పూర్తికి నెలవారీగా నిధులు కేటాయిస్తాం అని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు అన్నారు. నెలకు 400 మీటర్లు చొప్పున సొరంగం తవ్వితే 14కోట్లు నిధులు అవసరమవుతాయి అని పేర్కొన్నారు. నెలకు 400 మీటర్లు కాదు అంతకన్నా ఎక్కువ తవ్విన ఎంత మేరకు తవ్వితే అంత మేరకు బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రెండు సంవత్సరాలు క్యాలెండర్ నిర్ణయించుకుని SLBC ని పూర్తి చేయాలి. ఈ కార్యక్రమంలో పలువూరు నియోజక వర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికార యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.




# షూట్‌లో ఓ సూపర్ స్టార్ అభ్యంతరకరంగా తాకాడు

కాస్టింగ్ కౌచ్ సినీ పరిశ్రమలో కలకలం రేపుతుండగా తాజాగా ప్రముఖ టీవీ నటి షమ సికిందర్ సంచలన ఆరోపణలు చేశారు. వాణిజ్య ప్రకటన షూటింగ్‌లో ఓ స్టార్ నటుడు తనను అభ్యంతరకరంగా కౌగిలించుకున్నాడని ఆమె ఆరోపించారు. సన్నివేశం బాగా రావాలనే సాకుతో ఆయన అనూహ్యంగా తనను హగ్ చేసుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో అతడితో కలిసి తాను నటించబోనని షమ సికిందర్ స్పష్టం చేశారు. షూటింగ్‌లో భాగంగా సదరు నటుడు తనను హగ్ చేసుకోలేదని, వేరే ఉద్దేశంతోనే అలా చేశాడని వివరించారు. అతడు తనను హగ్ చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు తాను అసౌకర్యంగా భావించానని చెప్పుకొచ్చారు. తాను ఎంతోమందితో కలిసి పనిచేశానని, తనకు ఎంతో మంది మగవారితో స్నేహాలు ఉన్నా వారెన్నడూ ఇలా తనను అసౌకర్యానికి గురిచేయలేదని తెలిపారు. ఆ నటుడు చేసిన పనికి తాను షాక్‌కు గురయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ నటుడు సూపర్ స్టార్ అని, అలాంటి వ్యక్తి ఇంత దిగజారుడుగా ఎందుకు ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇది ఎంతో దిగ్భ్రాంతికర ఘటనని ఆమె పేర్కొన్నారు. తాను ఆ వ్యక్తిని తొలిసారి కలుసుకున్నానని, అతడు సాధారణంగా కనిపించలేదని, యాటిట్యూడ్‌తో ప్రవర్తించారని అన్నారు. ఇక అతడితో తన జీవితంలో ఎన్నడూ కలిసి పనిచేసేది లేదని స్పష్టం చేశారు. షమ సికిందర్ యే మేరి లైఫ్ హై, బట్లీవాలా హౌస్ నెంబర్ 43, కాజల్, సెవెన్, బాల్ వీర్ వంటి టీవీ షోస్‌లో ప్రముఖ పాత్రలో నటించారు. వెబ్ సిరీస్ మాయా : స్లేవ్ ఆఫ్ హర్ డిజైర్స్ వంటి షోలతో ప్రేక్షకుల్లో షమ మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు.



# నిజంగా కలలో ఊహించలేనిది

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వార్త ఏదైనా ఉంది అంటే అది తిరుపతి లడ్డు వివాదం అని చెప్పకతప్పదు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యికి బదులు జంతువుల నూనెలను వాడారని వచ్చిన నివేదికలు భక్తుల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. పవిత్రమైన తిరుపతి శ్రీవారి లడ్డూను కల్తీ చేయడంతో మహా పాపానికి పాల్పడిన నీచులను శిక్షించాలని భక్తులతో పాటు నెటిజన్లు ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే ఈ ఘటనపై పవన్ నటించిన అత్తారింటికి దారేది హీరోయిన్ ప్రణీత సుభాష్ కూడా తాజాగా ఎక్స్ వేదికగా స్పందించింది. శ్రీవారి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వులు వినియోగిస్తున్నారనే వార్తలు వస్తుండటం చాలా భాదాకరం. శ్రీవారి విషయంలో ఇలా జరగడం ఎంతో దారుణంగా ఉంది. ఇలాంటి పని చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇది శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులకు నిజంగా కలలో కూడా ఊహించలేని పరిణామం అంటూ ప్రణీత సుభాష్ రాసుకొచ్చింది. మరోవైపు ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ఈ ఘటనపై తీవ్రంగా విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆలయాల్లో జరిగే అంశాల పర్యవేక్షణకు జాతీయస్థాయిలో సనాతన ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మానికి ఏ రూపంలో ముప్పు వచ్చినా మనమంతా కలిసి నిర్మూలించాలని పిలుపునిచ్చారు.





# చిరంజీవికి అక్కినేని జాతీయ పురస్కారం


## చిరంజీవికి ఏఎన్ఆర్ నేషనల్ అవార్డ్

31నగరాల్లో అక్కినేని ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం: నాగార్జున

నట సామ్రాట్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియాతో కలిసి 'ఏఎన్ఆర్100 కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' పేరుతో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. ఏఎన్ఆర్ ఐకానిక్ ఫిల్మ్ 'దేవదాసు' స్క్రీనింగ్‌తో శుక్రవారం ఈ చిత్రోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. అక్కినేని నాగేశ్వరరావు పేరుతో పోస్టల్ స్టాంప్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ 'దేశవ్యాప్తంగా 31నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించబోతున్నాం. గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నాన్నగారి పేరు మీద ఓ ఛాప్టర్ చేస్తున్నాం. ఈ ఏడాది ఏఎన్ఆర్ నేషనల్ అవార్డును చిరంజీవిగారికి ఇవ్వాలని నిర్ణయించాం. ఈ విషయం చెప్పగానే ఆయన చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యారు. అక్టోబర్ 28న అమితాబ్ బచ్చన్‌గారు ఈ అవార్డును చిరంజీవికి ప్రదానం చేస్తారు.' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, రాఘవేంద్రరావు, శివేంద్రసింగ్ దుంగార్పూర్, వెంకట్ అక్కినేని, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అక్కినేని ఫిల్మ్ ఫెస్టివల్‌లో దేవదాసు, మిస్సమ్మ, మాయాబజార్, భార్యభర్తలు, గుండమ్మ కథ, డాక్టర్ చక్రవర్తి, సుడిగుండాలు, ప్రేమ్‌నగర్, ప్రేమాభిషేకం, మనం చిత్రాలను ప్రదర్శించనున్నారు.

# యుద్ధానికి సన్నద్ధం

ఎట్టకేలకు 'హరిహరవీరమల్లు' లొకేషన్‌లోకి పవన్‌కల్యాణ్ అడుగుపెట్టనున్నారు. ఈ నెల 23 నుంచి ఈ సినిమా తాజా షెడ్యూల్ విజయవాడలో మొదలుకానుంది. గ్లాడియేటర్, బోర్న్ ఐడెంటిటీ, ది లాస్ట్ సమురాయ్ వంటి లెజెండ్రీ మూవీస్‌కి పనిచేసిన హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్టు నిర్మాతలు తెలిపారు. 'పవన్‌కల్యాణ్‌తోపాటు నాజర్, రఘుబాబు, సునీల్, అభిమన్యుసింగ్, అయ్యప్ప తదితరులు ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నారు. 400మంది సిబ్బంది, భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులు, ఫైటర్లతో మునుపెన్నడూ చూడని స్థాయిలో యుద్ధ సన్నివేశాలను చిత్రీకరించేందుకు దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ తుదిదశకు చేరుతుంది' అని నిర్మాతలు చెప్పారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ ప్రతినాయకుని పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కళ: తోట తరణి, నిర్మాతలు: ఎ.దయాకర్‌రావు, ఎ.ఎం.రత్నం. నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com